అమరజీవి త్యాగం అజరామరం

దుర్గి/రెంటచింతల/కారంపూడి/పిడుగురాళ్ల: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా గురువారం దుర్గి బస్టాండ్ ఆవరణలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి పలువురు నివాళులర్పించారు. జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద పొట్టి శ్రీరాములు పోరాటస్ఫూర్తిని కొనియడారు. ముఖ్య అతిథిగా తహసీల్దార్ జి.రమేష్ కుమార్ మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటిన మహనీయుడు పొట్టి శ్రీరాములని చెప్పారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కపలవాయి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు కాసుల ప్రసాద్, కపలవాయి వెంకటప్పారావు, కటకం చిన వెంకటయ్య, యకటీల బుచ్చిబాబు, సర్పంచ్ శాంతా రమేష్, పల్చూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● రెంటచింతల రామాలయం సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం మండల మాజీ అధ్యక్షుడు, వైఆర్‌ఎస్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ యేచూరి వెంకటసైదయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేద విద్యార్థులకు దుస్తులు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నారాయణపురం శ్రీనివాసరావు, నాళం చినబాబు, గాదె ఊర్ధ్వమల్రెడ్డి, ఆకుల నర్సింహారావు, గుండా రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

● కారంపూడి గాంధీ బొమ్మ సెంటర్‌లో వివిధ స్వచ్ఛంద సంఘాల నాయకులు గురువారం పొట్టి శ్రీరాములు జయంత్యుత్సవం నిర్వహించారు. సత్యసాయి సేవా సంఘం, ఆర్యవైశ్య సంఘాల నాయకులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పూలమాలలు వేసి కొబ్బరి కాయలు కొట్టి నివాళులర్పించారు. ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరె అంకారావు, గుండా శ్రీనివాసరావు, కొలిశెట్టి మల్లికార్జునరావు, కరాలపాటు సుబ్బారావు, చీతిరాల కోటేశ్వరరావు, కొలిశెట్టి మల్లిఖార్జునరావు, కజ్జం ఆంజనేయులు, వెచ్చా వరలక్ష్మణరావు, కొత్తా బ్రహ్మేశ్వరరావు, సూరె సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల జానపాడు రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆయన జయంత్యుత్సవం నిర్వహించారు. విద్యా శాఖ రాష్ట్ర డైరెక్టర్ చింతా వెంకట రామారావు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరమని కొనియాడారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు జూలకంటి శ్రీనివాసరావు, దేవరంపాడు వెంకటేశ్వర స్వామి అభివృద్ధి కమిటీ సభ్యులు కట్టమూరి శంకర్‌రావు, గుంటూరు జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు చందోలు శివకృష్ణారావు, జిల్లా అధ్యక్షులు గుండా రామారావు, కొత్త రాఘవయ్య, చేదేళ్ల కృష్ణ, పతంగి అమర్, కాకుమాను రామారావు, వైష్ణవి, రజనీ దేవి, సైదారావు, కోటా బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.


దుర్గిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం


రెంటచింతలలో..


గురజాలలో అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తహసీల్దార్


కారంపూడిలో..


పిడుగురాళ్లలో..


బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల కళాశాలలో..

ఆదర్శనీయుడు పొట్టి శ్రీరాములు

గురజాల : ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు సమాజానికి ఆదర్శనీయుడని తహసీల్దార్ మీసాల దానియేలు చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంత్యుత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి చేసిన త్యాగం మరువలేనిదన్నారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో గాంధీబొమ్మ సెంటర్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మన్నెం కన్యాకుమారి ప్రసాద్, బొగ్గవరపు అక్కేశ్వరరావు, బి.ఫణికుమార్, చీతిరాల సత్యనారాయణ, యక్కల ఏడుకొండలు, వి.ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

విజయపురిసౌత్: స్థానిక బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల కళాశాలలో గురువారం పొట్టిశ్రీరాములు జయంత్యుత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీరాజ్యం శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీరాములు గొప్పతనాన్ని, ప్రాణ త్యాగాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దారామేరి మంజుల, అధ్యాపకులు చెంచులక్ష్మి, వాణిరాణి, అరుణ, పుష్పలీల, సరళ, నాగమణి, అరుణకుమారి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అందుబాటులో ఆర్‌బీకేలు



వెల్దుర్తి: రైతులకు ఆర్‌బీకేలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి చెప్పారు. గురువారం మండలంలోని గంగలకుంట, గొట్టిపాళ్ళ ఆర్‌బీకేలను వారు తనిఖీ చేసి సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో మాట్లాడారు. రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు.

కాన్షీరాం జయంత్యుత్సవం



దుర్గి: దళితులకు రాజ్యాధికారాన్ని అందించిన ఘనత కాన్షీరాంకు దక్కుతోందని పలువురు పేర్కొన్నారు. ముటుకూరు గ్రామంలో కాన్షీరాం జయంత్యుత్సవం నిర్వహించారు. చర్మకారుల సంఘం నాయకుడు పులిమెల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పులిమెల పెద వెంకయ్య, మాణిక్యం, దాసు, మాచర్ల అమరయ్య, లోకయ్య, ఏసోబు, బంకా నవీన్, పులిమెల బుజ్జి, ఏసుదానం, బాబురావు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు



గురజాల : రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ మీసాల దానియేలు చెప్పారు. రేషన్ పంపిణీ చేస్తున్న వాహనాలను గురువారం ఆయన పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ కార్డుదారులకు విధిగా సరుకులు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. వాహనంలో తూకం ఎలా ఉంది? సరుకులన్నీ అందిస్తున్నారా? లేదా అని కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు.

పరీక్ష కేంద్రం పరిశీలన



గురజాల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ మీసాల దానియేలు గురువారం పరిశీలించారు. వసతుల గురించి ఆరా తీశారు. గురువారం జరిగిన తెలుగు, హిందీ పరీక్షలకు జూనియర్ కళాశాల కేంద్రంలో 391 మంది విద్యార్థులకు 384 మంది హాజరైనట్టు ప్రిన్సిపల్ ఎస్వీ కృష్ణారెడ్డి, పల్లెగుంత మోడల్ పాఠశాలలో 398 మంది విద్యార్థులకు 385 మంది పరీక్ష రాసినట్టు ప్రిన్సిపల్ ఉషశ్రీ వివరించారు.

సెల్‌ఫోన్ షాపులో చోరీ

దాచేపల్లి: ఓ సెల్‌ఫోన్ షాపులో గురువారం చోరీ జరిగింది. దాచేపల్లి సీఐ బిలాలుద్దీన్ కథనం ప్రకారం.. నగర పంచాయతీ పరిధిలోని బంగ్లా సెంటర్‌లోని కరుణ మొబైల్ దుకాణంలోకి గురువారం తెల్లవారుజామున దుండగులు చొరబడి ఐదు సెల్ ఫోన్లు, ఒక ల్యాప్‌ట్యాప్‌ను దొంగిలించారు. వీటి విలువ సుమారుగా రూ.1.50 లక్షలు ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. షాపు నిర్వాహకుడు మూడు రోజులుగా ఊరిలో లేకపోవడాన్ని గమనించి తెల్లవారుజామున చోరీకి పాల్పడి ఉంటారని, దుకాణంలో సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. దుకాణాన్ని సీఐ, ఎస్ఐలు పరిశీలించారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

గురజాల : గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. గంగవరం గ్రామ సమీపంలోని శ్రీ వేంకటేశ్వర రైస్ ఇండస్ట్రీకి వరి పొట్టు రవాణా కోసం లారీని తీసుకుని వచ్చి నిలుపుదల చేసిన సమయంలో నల్గొండ జిల్లా దేవరకొండ మండలం మర్రారం గ్రామానికి చెందిన ఫయాజ్ (36) గుండెపోటు రావడంతో స్టీరింగ్‌పై పడిపోయాడు. తోటి డ్రైవర్‌లు గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించడంతో అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు వివరించారు.

వడ్డీ లేకుండా ఇంటి పన్నులు చెల్లించండి

గురజాల: రాష్ట్ర ప్రభుత్వం పన్నులపై వడ్డీ రాయితీ ప్రకటించిందని, ఫలితంగా ప్రజలు వడ్డీ లేకుండానే ఇంటి పన్నులు చెల్లించొచ్చని నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. రెండుమూడేళ్లుగా పన్నులు చెల్లించని వారికి ఈ రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న స్పెషల్ ఆఫీసర్

గురజాల : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని గురజాల మండలం స్పెషల్ ఆఫీసర్ ఎస్.సంజీవరావు చెప్పారు. మండల పరిధిలోని పల్లెగుంత గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్‌ను గురువారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టినట్టు వెల్లడించారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వంకాయలపాటి మల్లయ్య, గ్రామ కార్యదర్శి తెడ్లా గురుప్రసాద్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ

నరసరావుపేట రూరల్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వైఎస్సార్ క్రాంతిపథం, సీడాప్ ఆధ్వర్యంలో 10వ తరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్టు డీఆర్‌డీఏ ఏపీఎం రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 30 సంవత్సరాలు వయస్సు గల అభ్యర్థులు ఉచిత శిక్షణకు అర్హులని తెలిపారు. కంప్యూటర్ హార్డ్‌వేర్ నెట్‌వర్కింగ్, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు నాలుగు నెలల పాటు గుంటూరులో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు 9908482907 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చౌకబారు విమర్శలు తగవు

మాచర్ల రూరల్: ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై టీడీపీ పెయిడ్ ఆర్టిస్టు జూలకంటి బ్రహ్మారెడ్డి విమర్శలు చేయడం చౌకబారు రాజకీయాలకు నిదర్శనమని మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మల్లుస్వామి విమర్శించారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల్లో తిరుగులేని నాయకులుగా ఆదరణ పొందుతున్న పిన్నెల్లి సోదరులపై నిరాధార ఆరోపణలు చేయడం తగదన్నారు. గ్రానైట్ లారీలు ఇక్కడ నుంచి తరలిపోతున్నాయని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు పల్నాడులో మైనింగ్ డాన్‌గా పేరుందని, ఆయనపై సీబీఐ విచారణ కూడా జరుగుతున్న విషయం గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. పేద రైతులు రైతు కూలీలు ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూములకు అసైన్ కమిటీ ద్వారా భూపంపిణీకి శ్రీకారం చుడుతుంటే దానిపై కూడా విమర్శలు చేయడం బాధగా ఉందని పేర్కొన్నారు. 1999 నుంచి 11 ఏళ్ల బ్రహ్మారెడ్డి ఎక్కడ ఉన్నారని, బ్రహ్మారెడ్డి అమ్మ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏడుగురు సొంత కుటుంబ సభ్యులను దారుణంగా చంపించిన వారి గతం అంతా రక్త చరిత్రని ధ్వజమెత్తారు. ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో వర్గాలు గ్రూపులు పెడుతూ వర్గపోరుకు ఆజ్యం పోయడం తగదని బ్రహ్మారెడ్డికి హితవు పలికారు. ఇదే పంథా అనుసరిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పోతిరెడ్డి కోటిరెడ్డి, సర్పంచులు సంఘం అధ్యక్షులు ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, కౌన్సిలర్లు మాచర్ల ఏసోబు, మందా సంతోష్, సర్పంచ్‌లు ఆరికట్ల చంద్రారెడ్డి, ముక్కా గురవయ్య, నోముల కృష్ణ, జింకల వెంకటేశ్వర్లు, గోపాలరెడ్డి, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మల్లుస్వామి తదితరులు

టెన్త్ పరీక్ష కేంద్రాల పరిశీలన

పిడుగురాళ్ల: పరీక్షలకు హాజరయ్యే టెన్త్ విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులూ కగల కూడదని ఎంఈఓ ఒ.రాజు చెప్పారు. పట్టణంలోని పది పరీక్షా కేంద్రాలైన భాష్యం, శ్రీ చైతన్య, నారాయణ, కామేనేని పాఠశాలలతోపాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. వసతులపై ఆరాతీశారు. అనంతరం పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి స్కూల్‌లోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాన్ని పరీక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు బాషా, ఎన్‌సీసీ మాస్టర్ ఇమ్మానియేలు రాజు, హనుమంతరావు, సీఆర్‌పీలు నాగేశ్వరారావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ ఒంగోలు రాజు

దేవరంపాడులో పశువైద్య శిబిరం

రాజుపాలెం: దేవరంపాడులో పశువైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. శిబిరంలో ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ జి.వీరయ్య, డాక్టర్ కంచుపాటి నాగేశ్వరరావు 44 గేదెలకు చూడి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. అనంతరం రైతులకు సర్పంచ్ పత్తిపాటి దీనమ్మకోటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ జి.వీరయ్య మాట్లాడుతూ గేదెలలో ఎద లక్షణాలను గుర్తించడం, కృత్రిమ గర్భాధారణ, మూడు నెలల తరువాత చూడి పరీక్షలు చేయించడం తదితర అంశాలపై రైతులకు వివరించారు. అనంతరం దూడలకు నులిపురుగుల నివారణ మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవరంపాడు దేవస్థానం కమిటీ చైర్మన్ అంబటి బ్రహ్మయ్య, పశు వైద్య సిబ్బంది సాంబయ్య పాల్గొన్నారు.

సత్తెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

అచ్చంపేట: మాదిపాడు పరిధిలోని అడవిలో స్వయంభుగా వెలసిన సత్తెమ్మతల్లి ఆలయంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్తెమ్మతల్లి, సత్యదేవుళ్ల కల్యాణ మహోత్సవాన్ని ఈనెల 1న నిర్వహించామని పేర్కొన్నారు. 16 రోజుల పండగ సందర్భంగా ప్రత్యేక పూజాలు, 9 రకాల పూజాద్రవ్యాలతో అభిషేకాలు చేసినట్లు నిర్వాహకులు యర్రంశెట్టి శ్రీనివాసరావు, సత్యవతి దంపతులు తెలిపారు.



ఎస్సీ,ఎస్టీ కేసు విచారణ చేసిన డీఎస్పీ

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామంలో కులం పేరుతో దూషించి కొట్టిన ఘటనపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసిన నేపథ్యంలో నరసరావుపేట డీఎస్పీ సి.విజయ్‌భాస్కరరావు గురువారం విచారణ చేశారు. గ్రామసచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ముట్లూరి మణిరత్నంను అదే గ్రామానికి చెందిన గాలి వెంకటేశ్వర్లు, గాలి శ్రీనివాసరావు ఇరువురు వ్యక్తులు కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదు అందింది. ఈసందర్భంగా డీఎస్పీ సారథ్యంలో విచారణ చేపట్టగా పోట్లూరు గ్రామ సచివాలయంలో ఫిర్యాదు దారుడు ముట్లూరి మణిరత్నం, ఆరోగ్య కార్యకర్త, గ్రామసచివాలయ మహిళా పోలీసులను విచారణ చేసి చెప్పిన అంశాలను పోలీసులు వీడియో తీశారు. అనంతరం డీఎస్పీ విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 8వ తేదీన సాయంత్రం రీసర్వే పనులకు సంబంధించిన ధృవీకరణ పత్రాలు అందజేయగా, ఈపని తాను చేసేది కాదని సమాధానం చెప్పి ధృవీకరణ పత్రాలు పక్కనే ఉన్న బల్లపై పెట్టారన్నారు. ఈక్రమంలో గాలి వెంకటేశ్వర్లు, గాలి శ్రీనివాసరావు కులం పేరుతో దూషించి దుర్భాషలాడి, గొడవపడి కొట్టినట్లు ఫిర్యాదుదారుడు మణిరత్నం విచారణలో చెప్పినట్లు డీఎస్పీ తెలిపారు. డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ కేసులు 48 కేసులు నమోదు చేశామన్నారు. ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంక పరచటంతో పాటు కులం పేరుతో దూషించి కొట్టినందుకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. డీఎస్పీ వెంట ఎస్సై గల్లా రవికృష్ణ ఉన్నారు.


పోట్లూరులో విచారణ చేస్తున్న డీఎస్పీ విజయ్‌భాస్కరరావు

ఇర్లపాడులో పర్యటించిన కలెక్టర్

- కేంద్రియ విద్యాలయ భూమి పరిశీలన
- వివరాలతో హాజరుకావాలంటూ ఆదేశం

నాదెండ్ల: ఇర్లపాడు కేంద్రియ విద్యాలయానికి కేటాయించిన భూమిని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ గురువారం సందర్శించారు. సర్వే నెంబరు 431లోని సబ్ డివిజన్‌లో య.16.64సెంట్లు భూమి ఉండగా, ఇందులో య.10.11 సెంట్ల భూమిని గతంలో పంచాయతీ తీర్మానం చేసి కేంద్రియ విద్యాలయ నిర్మాణానికి స్థానిక రెవెన్యూ అధికారులు అంగీకార పత్రాలు ఇచ్చారు. దీనిలో సుమారు య.1.90 సెంట్లు భూమిపై ఓ రైతు కోర్టును ఆశ్రయించగా ఇటీవల కోర్టు కేంద్రియ విద్యాలయానికి అనుకూలంగా తీర్పునిచ్చింది. అయితే ఈ భూమిని ఆనుకుని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి 300 ప్లాట్లతో ప్రైవేటు లేఔట్ వేశాడు. ఈ లేఔట్‌లోకి వెళ్లాలంటే కేంద్రియ విద్యాలయానికి కేటాయించిన భూమి మీదుగానే వెళ్లాల్సి ఉంది. రియల్‌ఎస్టేట్ వ్యాపారి తమ ప్లాట్లకు దారి కావాలంటూ కలెక్టర్‌కు అర్జీ అందించాడు. అదీగాక విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరాడు. కేంద్రియ విద్యాలయ చైర్మన్ హోదాలో కలెక్టర్ శివశంకర్ భూములను పరిశీలించి స్థానిక అధికారులతో మాట్లాడారు. వచ్చే సోమవారం నాటికి అన్ని వివరాలతో కలెక్టరేట్‌కు హాజరు కావాలని ఆదేశించారు. ఆయనతో పాటూ తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, మండల సర్వేయర్ అబ్బూరి శ్రీనివాసరావు, డీటీ అనురాధ, కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపల్ విజయ కుమార్, మండల విద్యుత్‌శాఖ ఏఈ ప్రసాద్, కాంట్రాక్టర్, స్థానిక వీఆర్వోలు పాల్గొన్నారు.


భూములు పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

తిరుమల కళాశాలలో ఉద్రిక్తత

- పార్టీ కండువాలతో టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ చదలవాడ హల్‌చల్
- విద్యార్థులతో కలిసి టీడీపీ పాటలకు డాన్సులు
- అడ్డుకున్న మరో వర్గం
- అనుమతి లేకుండా వచ్చారంటున్న కళాశాల యాజమాన్యం

నరసరావుపేట రూరల్: జొన్నలగడ్డలోని తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సాంకేతిక సమ్మేళనం ఉద్రిక్తతలకు దారితీసింది. ప్రశాంత వాతావరణంలో విద్యార్థుల ఆట పాటలతో ఉత్సాహంగా జరుగుతున్న సమ్మేళనం టీడీపీ నాయకుల రంగప్రవేశంతో ఉద్రిక్తంగా మారింది. విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపర్చుకునేందుకు ఉపయోగించాల్సిన సమ్మేళనాన్ని టీడీపీ నాయకులు రాజకీయ ప్రసంగాలకు వేదికగా మార్చారు. దీంతో విద్యార్థులు రెండు వర్గాలుగా విడిపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కళాశాలలో నిర్వహిస్తున్న సాంకేతిక సమ్మేళనానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరయ్యారు. టీడీపీ కండువాలు వేసుకుని డాక్టర్ అరవిందబాబు కళాశాలకు వచ్చారు. వారితో వచ్చిన వారు పచ్చకండువాలను విద్యార్థులకు పంచిపెట్టారు. ఈ క్రమంలో పార్టీ కండువాలు ధరించి విద్యార్థులు టీడీపీ పాటలకు నృత్యాలు చేయడం మొదలు పెట్టారు. దీనికి కొంత మంది విద్యార్థులు అభ్యంతరం చెప్పడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. తరువాత కూడా టీడీపీ పాటలు వేస్తూ డాన్స్‌లు కొనసాగించడంతో మరో వర్గం విద్యార్థులు సమ్మేళనాన్ని బాయ్‌కాట్ చేసి బయటకు వెళ్లిపోయారు. రూరల్ ఎస్‌ఐ బాలనాగిరెడ్డి కళాశాలలోనే ఉండి ఎటువంటి ఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఇంత జరుగుతున్నా కళాశాల యాజమాన్యం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సాంకేతిక సమ్మేళనానికి రాజకీయ నాయకులను ఆహ్వానించడం ఏమిటని పలువురు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఒక వర్గాన్ని ప్రోత్సహించే విధంగా కళాశాల యాజమాన్యం చర్యలు ఉన్నాయని వారు మండిపడుతున్నారు.


పార్టీ కండువాలతో విద్యార్థినులతో కలిసి డ్యాన్స్ చేస్తున్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు

అనుమతి లేకుండా కళాశాలలోకి ప్రవేశించారు

కళాశాల స్థాపించినప్పటి నుంచి కులాలకు, రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్నాం. మా అనుమతి లేకుండా టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ చదలవాడ అరవిందబాబు కళాశాలలోకి ప్రవేశించారు. అడ్డుకున్న సెక్యూరిటీ సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించారు. ఐదు వాహనాల్లో వచ్చి విద్యార్థులతో కలిసి టీడీపీ పాటలకు డ్యాన్స్‌లు చేశారు. దీనివలన కళాశాల ప్రతిష్టకు భంగ కలిగింది. ఇటువంటి ఘటనల వలన విద్యార్థుల మధ్య గ్రూపులు ఏర్పడి కళాశాల వాతావరణం దెబ్బతింటుంది.

–డాక్టర్ వైవీ నారాయణ, ప్రిన్సిపల్

దుర్మార్గపు ఆలోచన

కళాశాల యాజమాన్యంలో వేర్వేరు పార్టీలు ఉన్నా ఎప్పుడూ కళాశాలలోకి రాజకీయ పార్టీలను అనుమతించలేదు. కానీ డాక్టర్ అరవిందబాబు దురుద్దేశంతో పార్టీ జెండాలతో కళాశాలలోకి అడుగుపెట్టాడు. విద్యార్థులను రెండు వర్గాలుగా విడగొట్టి ఉద్రిక్తతలు సృష్టించే కుట్ర చేశాడు. అనుమతి లేకుండా గేట్లు నెట్టుకుంటూ వందమందితో కళాశాలలోకి ప్రవేశించారు. వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. దీంతో పాటు కళాశాల ప్రతిష్టకు భంగం కలిగించినందుకు పరువునష్టం దావా వేస్తాం.

–బొల్లా బ్రహ్మనాయుడు, కళాశాల చైర్మన్

రైతుల్లో కలవరం

● కారంపూడి మండలంలో చిరుజల్లులు

కారంపూడి: మండలంలో గురువారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన చిరుజల్లులు ప్రారంభమయ్యాయి. దీంతో మిర్చి రైతుల్లో కలవరం మొదలైంది. కల్లాలలో ఆరబోసిన పంట తడవకుండా టార్పాలిన్ పట్టాలు కప్పుతూ కర్షకులు కనిపించారు. మండలంలో వందలాది క్వింటాళ్ల మిర్చి కల్లాలలో ఆరబోసి ఉంది. మిర్చి తడిస్తే నాణ్యత తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న పంట కూడా కల్లాలలో ఆరబోసి ఉందని, గోతాలు పట్టి ఉన్న వాటిని రైతులు ఇళ్లకు తరలించుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు.


కారంపూడిలో మిర్చి తడవకుండా పట్టాలు కప్పుతున్న రైతులు